అడుగుకో గుంత..

పులివెందుల నియోజకవర్గం సీఎం జగన్మోహన రెడ్డి సొంత ఇలాకా. దీనికి ఆనుకునే జమ్మలమడుగు, ప్రొద్దుటూరు నియోజకవర్గాలు ఉన్నాయి. ఈ రెండు నియోజకవర్గాల ప్రజలు పులివెందులకు పోవాలన్నా, సత్యసాయి జిల్లాలోని కదిరికి చేరుకోవాలన్నా వయా ముద్దనూరు మీదుగా వెళ్లాల్సిందే. ఇంతటి కీలకమైన ఈ రహదారి అడుగుకో గుంతతో అధ్వాన్నంగా ఉంది.

రాష్ట్రమంతా రహదారుల్లో గుంతలు ఏర్పడి అధ్వాన్నంగా ఉన్నాయి. చివరకు.. సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సొంతూరికి పోయేదారి కూడా గుంతలయమై రాకపోకలకు ఇబ్బందిగా మారింది. సొంతూరికి వెళ్లే రోడ్డునే బాగుచేసుకోలేని సీఎం ఇక ఇతర ప్రాంతాల రోడ్లను ఏం పట్టించుకుంటాడని ఈ మార్గంలో వెళ్లే వాహనదారులు ప్రశ్నిస్తున్నారు.



సీఎం నియోజకవర్గంలోని మల్లేల ఘాట్ మలుపులో గుంతల్లో వస్తున్న బస్సు

- గుంతల రోడ్డులో ప్రయాణంతో వాహనదారుల అవస్థలు
- ప్యాచ్‌లకే పరిమితమవుతున్న రోడ్డు
- పులివెందుల, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు వాసులకు నరకం
- సీఎం సొంతూరి ప్రజలు రైలు మార్గానికి వెళ్లాలంటే ఇదే దారి
- అయినా పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం

ముద్దనూరు, ఫిబ్రవరి 14: ముద్దనూరు నుంచి పులివెందులకు దాదాపు 35 కిలోమీటర్ల దూరం ఉంటుంది. 30 కి.మీ మేర రహదారి గుంతలు ఏర్పడి చాలా ఆధ్వాన్నంగా తయారైంది. ఈ దారి జమ్మలమడుగు నియోజకవర్గంలో 10 కి.మీ ఉండగా.. మిగతా 20 కి.మీ పులివెందుల నియోజకవర్గంలో ఉండటం విశేషం. ద్విచక్రవాహనాల మొదలు భారీ వాహనాల వరకు ఈ రోడ్డు గుండా ప్రయాణం చేయాలంటే నరకం అనుభవిస్తున్నారు. గుంతలను తప్పించాలంటే ట్రాఫిక్ నింబంధనలు పక్కన పెట్టాల్సిందే. దీంతో ప్రమాదం కోరి తెచ్చుకోవాల్సిన పరిస్థితులు ఉన్నాయి.

పులివెందుల నియోజకవర్గంలో 20 కి.మీ

జమ్మలమడుగు నియోజకవర్గంలోని ముద్దనూరు మండలం నల్లబల్లె, చిన్నదుద్యాల, పెద్దదుద్యాలతో పాటు ఇదే మార్గం గుండా వెళ్లే వేల్పుచర్ల, ఉప్పలూరు, కొలవలి గ్రామ ప్రజలు చాల ఇబ్బందులు పడుతున్నారు. 10కి.మీ మేర ముద్దనూరు మండల ప్రజలు ఇబ్బందులు పడుతుంటే.. పులివెందుల నియోజవర్గంలో పులివెందుల, తొండూరు మండలంలోని తొండూరు, మల్లేల, ఇనగనూరు సింహాద్రిపురం మండలంలోని గ్రామాల ప్రజలు దాదాపు 20 కి.మీ రహదారిలో గుంతలో అవస్థలు పడుతున్నారు. నల్లబల్లె, మల్లేల ఘాట్ రోడ్డు మలుపులో పెద్దగుంతలు ఏర్పడి ప్రమాదకరంగా ఉంది. మల్లేల గ్రామంలోని దర్గాకు జిల్లా నలుమూలల నుంచి వాహనాలలో వచ్చే భక్తులు, బెంగళూరు వెళ్లే వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు.

గతంలో ఇదే మార్గంలో..

దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, ఆయన సోదరుడు దివంగత మాజీ మంత్రి వివేకానందరెడ్డి ఇదే రహదారి గుండా వాహనాల్లో ముద్దనూరుకు వచ్చి రైలులో హైదరాబాదుకు వెళ్లేవారు. వైఎస్ జగన్మోహన రెడ్డి సీఎం అయినప్పటి నుంచి ముద్దనూరు రోడ్డు మార్గాన వచ్చి ఏ రోజూ రైలెక్కలేదు. ఆయన ఈ మార్గంలో రాకపోవడంతో రోడ్డు అధ్వాన్న పరిస్థితి తెలియలేదేమనని ప్రజలు విమర్శిస్తున్నారు. స్టేట్ హైవే రోడ్డుగా ఉన్న ఈ రహదారిని 2021లో జాతీయరహదారిగా మార్చారని సమాచారం. ఇప్పటి వరకు ఈ రోడ్డుకు ప్యాచ్‌లు తప్ప కొత్త రోడ్డుకు నోచుకోలేదు. భారీ ప్రమాదాలు జరుగకముందే సీఎం తన నియోజకవర్గానికి నాలుగు లేన్ల రోడ్డు ఏర్పాటు చేయాలని జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, పులివెందుల నియోజకవర్గాల ప్రజలు కోరుతున్నారు.

త్వరలో ప్యాచ్ వర్కు..

ముద్దనూరు నుంచి బి.కొత్తపల్లె వరకు తాత్కాలిక ప్యాచ్ వర్కులకు టెండర్ పూర్తయింది. త్వరల్లో పనులు ప్రారంభిస్తాం. 60కి.మీ వరకు రూ.3కోట్లు మంజూరైంది. ముద్దనూరు నుంచి హిందూపురానికి నాలుగు లేన్ల రోడ్డు టెండర్ దశలో ఉంది. ముద్దనూరు నుంచి బి.కొత్తపల్లె, బి.కొత్తపల్లె నుంచి గోరంట్ల, గోరంట్ల నుంచి హిందూపురం మూడు ప్యాకేజీల్లో రోడ్డు నిర్మాణం జరగనుంది.

- దీపక్‌రెడ్డి, ఎన్‌హెచ్, ఏఈ



తొండూరు గురుకుల పాఠశాల ఆలయాల మార్గమధ్యంలో దెబ్బతిన్న రోడ్డు



భయం భయంగా ప్రయాణిస్తున్నాం..

ప్రతి చిన్నపనికి ముద్దనూరు వెళ్లాలి. నల్లబల్లె నుంచి ముద్దనూరు రెండు కి.మీ మాత్రమే ఉంటుంది. బైకుపై వెళితే సురక్షితంగా ఇంటికి చేరేంత వరకు భయం భయంగా ఉంటుంది. రోడ్డుకు అవతల పొలాలు ఉన్నాయి. పొలాల వద్దకు ట్రాక్టర్లు, ఎద్దుల బండ్లు వస్తుంటాయి. రోడ్డులో గుంతలు తప్పించే క్రమంలో భారీ వాహనాలు అడ్డంగా వచ్చేస్తుంటాయి.


- బాబురెడ్డి, నల్లబల్లె

ప్యాచ్ వర్కులతో కాలం గడుపుతున్నారు..

పులివెందుల రోడ్డు గుంతలు పడి చాలా ప్రమాదకరంగా ఉంది. రోడ్డు వేయలేని దుస్థితులో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. ప్యాచ్‌లు వేసి కాలం గడుపుతున్నారు. అవి రెండు రోజుల్లోనే దెబ్బతింటున్నాయి. నాలుగు వరుసల రోడ్డు అంటున్నారు. అతిలేదు-గతిలేదు. ఉప్పలూరు వెళ్లాంటే భయం భయంగా వాహనాల్లో వెళుతున్నాం.



- పల్లా గోపాలక్రిష్ణయ్య, బీజేపీ నాయకులు, ఉప్పలూరు



నల్లబల్లె వద్ద గుంతలు తప్పించే క్రమంలో రోడ్డుకు కుడివైపు వస్తున్న వాహనం



పెద్దదుద్యాల సమీపంలో దెబ్బతిన్న రోడ్డు



మల్లేల విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద దెబ్బతిన్న రోడ్డు



మల్లేలలో దర్గాకు వెళ్లే మార్గం సమీపంలో ఏర్పడ్డ గుంతలు

గరుడ వాహన గోవిందా..

కడప (కల్చరల్), ఫిబ్రవరి 14: దేవుని కడప లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఐదోరోజైన బుధవారం రాత్రి గరుడ వాహనంపై భక్తులను కటాక్షించాడు. టీటీడీ ఆధ్వర్యంలో సాగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా ఉదయం 9 గంటలకు శ్రీవారు ముత్యపు పందిరిలో ఊరేగారు. ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణమోమన్, త్రివిక్రమ్ సారథ్యంలో శ్రీవారికి ప్రత్యేక పూజలు, అలంకారం గావించారు. తదుపరి స్వామివారికి స్నపన తిరుమంజనం, సాయంత్రం 6 గంటలకు ఊంజల్‌సేవ చేశారు. అనంతరం గాయకులు ఆలపించిన అన్నమాచార్య కీర్తనలు భక్తుల మన్ననలు అందుకున్నాయి. రాత్రి 8గంటలకు దేవదేవుడు గరుడవాహనంలో శ్రీదేవి, భూదేవి సమేతంగా భక్తులకు మాడవీధులలో దర్శనమిచ్చారు. గరుడ సేవకు భక్తులు అధికసంఖ్యలో హాజరయ్యారు. ఉత్సవాల సందర్భంగా కోలాటం, హరికథా గానం భక్తులను అలరించాయి. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి, పెద్ద



సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



ఉదయం ముత్యపు పందరిలో శ్రీవారి ఊరేగింపు

టీడీపీ నూతన కార్యాలయం ప్రారంభం

కడప (ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 14: కడప నగర పరిధిలోని బిల్టప్ సమీపంలో పీఎస్‌ఆర్ ఎస్టేట్ వద్ద బుధవారం తెలుగుదేశం పార్టీ నూతన కార్యాలయాన్ని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పుత్తా నరసింహారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మొదట వేదపండితులు గోపూజ చేయించి అనంతరం ఇంటి ఇష్టదైవం చిత్రపటాలతో మొదటి గుమ్మానికి గుమ్మడికాయ కొట్టి పుత్తా దంపతులు కుటుంబ సభ్యులతో కలసి కుడికాలు పెట్టించి గృహప్రవేశం చేయించారు. అక్కడే హోమం, సత్యనారాయణస్వామి వ్రతం చేయించారు. టీడీపీ కార్యాలయం ప్రారంభోత్సవానికి నియోజకవర్గాల ఇన్‌చార్జిలు, జిల్లా టీడీపీ నాయకులు, కార్యకర్తలు, పుత్తా అభిమానులు పెద్దఎత్తున హాజరయ్యారు. వేలాదిగా తరలివచ్చిన వారందరికీ భోజన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో పుత్తా చైతన్యరెడ్డి, పుట్టా సుధాకర్‌యాదవ్, అలంఖాన్‌పల్లె లక్ష్మిరెడ్డి, మన్మోహన్‌రెడ్డి, అమీర్‌బాబు, దేవగుడి నారాయణరెడ్డితో పాటు పుత్తా కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



కడప బిల్టప్ సమీపంలో నూతన టీడీపీ కార్యాలయం ప్రారంభోత్సవంలో పుత్తా నరసింహారెడ్డి దంపతులు, కృష్ణచైతన్యరెడ్డి తదితరులు

వైసీపీలో బీసీ ఫీవర్

- మా ఓట్లతో మీరు పల్లకీ ఎక్కుతారా
- సామాజిక న్యాయం అంటూ..
- ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తారా..
- ఈసారి ఎమ్మెల్యే టికెట్స్ కావాల్సిందే
- వైసీపీకి ప్రొద్దుటూరు బీసీ నేతల అల్టిమేటం



(కడప-ఆంధ్రజ్యోతి): నేతిబీరకాయలో నెయ్యి ఎలా ఉంటుందో వైసీపీ చెప్పే సామాజిక న్యాయం కూడా అలాగే ఉంటుందని అంటుంటారు. నా బీసీలు, నా ఎస్సీలు, నా ఎస్టీలు అంటూ పాట పాడే జగన్ ఆ వర్గాలకు చేసింది మాత్రం నామమాత్రమే. స్థానిక సంస్థల పదవులు, నామినేటెడ్ పోస్టుల్లో సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తామని గొప్పలు చెప్పుకుంటున్న జగన్ శిబిరం విధులు, నిధులు, అత్యున్నతమైన కార్పొరేషన్ పదవులన్నీ సొంత సామాజిక వర్గానికే కట్టబెట్టింది. బీసీ ఇతర కులస్తులకు కేవలం ఆయా కార్పొరేషన్ పదవులు మాత్రమే కట్టబెట్టారు. చెప్పుకోవడానికి పదవి ఉంది తప్ప ఒక్కరికి కూడా సాయం చేయలేని స్థితిలో వీరు ఉన్నారు. ఇప్పుడు ఎన్నికలు దగ్గరపడడంతో జనాభా దామాషా ప్రకారం బీసీలకు వచ్చే ఎన్నికల్లో టికెట్ ఇవ్వాలనే డిమాండ్ పెరిగింది. ఇప్పటికే ప్రొద్దుటూరులో బీసీ నేతలు సమావేశాన్ని ఏర్పాటు చేసి డిమాండ్ చేశారు.

సామాజిక సాధికారత అంటూ బస్సు యాత్ర నిర్వహించారని ఇప్పుడు ఎమ్మెల్యే టికెట్ ఇచ్చి తమకు సామాజిక సాధికారత చేకూర్చాలని ప్రొద్దుటూరులో బీసీ నేతలు డిమాండ్ చేస్తున్నారు. 18న ప్రొద్దుటూరులో బీసీల ఆత్మ గౌరవ సభ ఏర్పాటు చేసి డిక్లరేషన్ ప్రకటిస్తామని వెల్లడించారు. ప్రొద్దుటూరులో బీసీ నేత నందం సుబ్బయ్యను దారుణంగా హత్య చేయడంపై బీసీ నేతలు ఆక్రోశం వ్యక్తం చేశారు. ఇప్పుడు ఈ వ్యవహారంతో వైసీపీకి బీసీ ఫీవర్ పట్టుకుంది. వైసీపీ ఆవిర్భావం నుంచి ఉమ్మడి కడప జిల్లాలో రిజర్వుడు స్థానమైన బద్వేలు, రైల్వేకోడూరును ఎస్సీలకు కేటాయిస్తే కడపను ముస్లింలకు కేటాయించారు తప్ప బీసీ నేతలకు పోటీ చేసే అవకాశం ఇవ్వలేదు. జిల్లా జనాభాలో దాదాపు సగం మంది బీసీల వాటా ఉంది. ఈ నేపథ్యంలో మేం పల్లకీ మోసేవారం కాకూడదు. పల్లకీలో కూర్చునే అవకాశం మాకూ రావాలంటూ బీసీలు గొంతెత్తుతుండడం వైసీపీలో ఆందోళన కలిగిస్తోంది.

రగులుతున్న బీసీలు

నిధులు విధులు లేని పదవులు ఇచ్చేసి జగన్ పాలనలో సామాజిక న్యాయం జరిగిందంటూ జిల్లాలో బస్సుయాత్ర చేపట్టారు. కడప, ప్రొద్దుటూరు, మైదుకూరు, బద్వేలు, చెన్నూరులలో బస్సు యాత్ర సాగింది. మీటింగ్ అంతా జగన్ భజన చేయడం, చంద్రబాబును విమర్శించడం చూసి వచ్చిన జనాలు కూడా వచ్చినట్లే జారుకున్నారు. పార్టీలో బీసీలకు సరైన ప్రాధాన్యత లేదనే ఆక్రోశం సామాజిక బస్సుయాత్రలో స్పష్టంగా కనిపించింది. ప్రొద్దుటూరులో జరిగిన సామాజిక సాధికార బస్సు యాత్రలో.. బీసీ సామాజిక వర్గానికి చెందిన అక్కడి ఎమ్మెల్సీ రమేశ్ యాదవ్‌కు అసలు అహ్వానమే లేదని ఆరోపణలు వచ్చాయి. ఆ రోజు బస్సుయాత్రలో ఆయన పాల్గొనకపోవడం దీనికి బలం చేకూర్చింది. దీనికి తోడు ఇటీవల కడప మేయర్ సురేశ్‌బాబు మాట్లాడుతూ.. జిల్లాలో ఎమ్మెల్యే, ఎంపీగా గెలిచే స్థాయి ఉన్న బీసీలు ఎవ్వరూ లేరని చెప్పడం కూడా బీసీల్లో ఆగ్రహాన్ని పెంచింది. వైసీపీ అధిష్టానం బీసీ సామాజికవర్గ నేతతోనే ఇలా మాట్లాడించడం వీరు జీర్ణించుకోలేకపోతున్నారు. జిల్లాలో కడప, ప్రొద్దుటూరు, మైదుకూరు, జమ్మలమడుగులలో బీసీల జనాభా ఎక్కువగా ఉంది. ఇక్కడ టికెట్లు ఆశించే వారూ ఉన్నారు. కడప మేయరు సురేశ్‌బాబు వైఎస్ కుటుంబానికి నమ్మిన బంటుగా ఉన్నారు. కడప అసెంబ్లీ నుంచి పోటీ చేయాలనుకున్నారు. ఈసారి అయినా టికెట్ వస్తుందని భావించారు. అయితే ఆ పరిస్థితి లేదంటున్నారు. దివంగత రాజశేఖర్‌రెడ్డి కాంగ్రెస్‌లో ఉన్నప్పుడు బీసీ నేతలను ప్రోత్సహించి బండి హనుమంతుకు అవకాశం ఇచ్చారు. ఆయన తనయుడి పార్టీ వైసీపీలో మాత్రం బీసీలకు ఎమ్మెల్యేగా అవకాశం కల్పించలేదు.

ప్రొద్దుటూరులో బీసీల ఆక్రోశం

ప్రొద్దుటూరులో బీసీలు ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించాలనే తపన వారిలో బలంగా ఉంది. రెండురోజుల క్రితం టీడీపీ, వైసీపీ, ఇతర పార్టీలకు చెందిన బీసీ నేతలు సమావేశమై ప్రొద్దుటూరు టికెట్ బీసీలకు ఇవ్వాలంటూ డిమాండ్ చేశారు. 1956 నుంచి ఇంత వరకు ప్రొద్దుటూరులో రెడ్డికులస్తులకే టికెట్ ఇస్తున్నారు. ఈ సారి బీసీలకు టికెట్ ఇవ్వాలన్న డిమాండ్ వారిలో బాగా కనిపిస్తోంది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత టీడీపీకి చెందిన బీసీ నేత నందం సుబ్బయ్యను అత్యంత దారుణంగా హతమార్చారు. ఇది రాష్ట్రంలోనే కలకలం రేపితే ప్రొద్దుటూరులో బీసీ వర్గీయులను కలవరపాటుకు గురిచేసింది. ఆ హత్యను వారు జీర్ణించుకోలేక పోయారంటారు. ఇక ప్రొద్దుటూరు పట్టణం, చుట్టుపక్కల గల బీసీలకు చెందిన ఆస్తులను నామమాత్రం ధరకే అధికార పార్టీకి చెందిన పెద్దలు లాక్కున్నారన్న విమర్శ ఉంది. కోట్ల విలువ చేసే స్థలాలను తక్కువ ధరకు కొట్టేయడం బీసీలు జీర్ణించుకోలేకపోతున్నారు. బీసీల పై దాడులు, బెదిరింపులు ఇవన్నీ కసి పెంచినట్లు చెబుతున్నారు. ప్రొద్దుటూరు టికెట్‌ను ఏపీ భవన్‌లో పనిచేస్తున్న బీసీ మహిళా నేత చెన్నా సరళాదేవి ఆశిస్తున్నట్లు చెబుతున్నారు. ఈ మేరకు రెండు రోజుల క్రితం జరిగిన సమావేశానికి ఆమె హాజరయ్యారు. వై నాట్ బీసీ పేరిట ప్రొద్దుటూరులో ఫ్లెక్సీలు వెలిశాయి. సరళాదేవి వైసీపీ టికెట్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇంతవరకు జిల్లాలో వైసీపీ బీసీల్లో ఒక్కరికి కూడా ఎమ్మెల్యే టికెట్ ఇవ్వలేదు. ఎన్నికల వేళ బీసీలు టికెట్ కోసం గొంతెత్తడం వైసీపీని కలవరపాటుకు గురిచేస్తోందని అంటున్నారు.

టీడీపీ బెటర్

జిల్లాలో మైదుకూరు అసెంబ్లీ నియోజకవర్గానికి టీడీపీ తరఫున పుట్టా సుధాకర్‌యాదవ్ 2014 సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి పాలయ్యారు. దీంతో తెలుగుదేశం పార్టీ ఆయనను టీటీడీ ఛైర్మన్‌గా నియమించి గౌరవించింది. ఇక 2019 ఎన్నికల్లోనూ ఆయనకే టికెట్ కేటాయించింది. ఈ సారి కూడా పుట్టానే మైదుకూరు నుంచి బరిలో దిగనున్నారు. ఇప్పటికే టీడీపీ అంటే బీసీల పార్టీగా పేరుంది. ఇప్పటికే బీసీలకు మైదుకూరు టికెట్ కేటాయించింది. దీంతో వైసీపీలో ఉన్న చాలామంది బీసీలు రాజకీయంగా తమకు టీడీపీనే బెటర్ అనే స్థితికి వచ్చారని అంటున్నారు. ఇది వైసీపీని ఆందోళనకు గురిచేస్తోంది.



ప్రొద్దుటూరులో బీసీలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

ఉద్యోగుల సమస్యలపై ఉద్యమానికి సిద్ధం

- రూ.20 వేల కోట్ల ఆర్థిక బకాయిలు విడుదల చేయాలి
- 30 శాతం ఐఆర్ ప్రకటించాలి
- ఏపీ జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హృదయరాజు



ఉద్యమాన్ని ప్రారంభిస్తున్న ఏపీ జేఏసీ రాష్ట్రప్రధాన కార్యదర్శి హృదయరాజు

కడప(కలెక్టరేట్), ఫిబ్రవరి14: ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కార్మికులు తమ సమస్యల సాధన కోసం అంతా సిద్ధమని ఏపీ జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హృదయ రాజు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఏపీ జేఏసీ రాష్ట్రవ్యాప్త ఉద్యమ కార్యాచరణలో భాగంగా బుధవారం కడప నగరంలోని నీటి పారుదల శాఖ కార్యాలయం ఆవరణలో ఉద్యమాన్ని ప్రారంభించి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఏపీ జేఏసీ జిలా చైర్మన్ బి.శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి డి.రవికుమార్ అధ్యక్షతన ఉద్యోగులంతా నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా హృదయరాజు మాట్లాడుతూ ఉద్యోగులు, పెన్షనర్లు, ఉపాధ్యాయులు, కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారంలో ప్రభుత్వం మొండి వైఖరి వీడాలన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఆర్థిక బకాయిలు విడుదల చేస్తామని, అదేవిధంగా కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చి ఇంతవరకు ప్రభుత్వం అయలు చేయకపోవడం దుర్మార్గమన్నారు. పీఆర్సీకి సంబంధించి ఇంతవరకు ఎలాంటి చర్చలు లేవని, 30 శాతం ఐఆర్ ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈనెల 12వతేదీన జరిగిన జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లో ఉద్యోగుల సమస్యలపై చర్చలు విఫలమయ్యాయన్నారు. ప్రభుత్వం మొండిగా వ్యవహరించడంతో ఏపీ జేఏసీ తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు ఉద్యమబాట పట్టక తప్పలేదన్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం ఉద్యోగుల సొమ్ము దాదాపు రూ20 వేల కోట్ల బకాయిలు ఉన్నాయని వీటిని వెంటనే విడుదల చేయాలన్నారు. ఈనెల 15, 16 తేదీల్లో భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలతో నిరసన, 17న తాలూకా స్థాయిలో ర్యాలీలు, ధర్నాలు, 25న జిల్లా స్థాయిలో ధర్నా, ర్యాలీలు నిర్వహిస్తామన్నారు. అప్పటికీ ప్రభుత్వం దిగిరాకపోతే 25వ తేదీన చలో విజయవాడ కార్యక్రమానికి సిద్ధం అవుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నీటి పారుదల సంఘం అధ్యక్షుడు డి.శ్రీనివాసులు, ఎన్జీవో సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.రవికుమార్, శైలేశ్వరరెడ్డి, పద్మనాభరావు, కాటమయ్య, జానకి, కమాల్ బాష తదితరులు పాల్గొన్నారు.

బీటెక్ విద్యార్థి ఆత్మహత్య



ఇస్మాయల్ మృతదేహం

సాగర్‌నగర్ (విశాఖపట్నం), ఫిబ్రవరి 14: అనారోగ్య కారణాలతో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... కడప జిల్లా బద్వేల్‌కు చెందిన గోనుగుంట ఇస్మాయల్ (19) విశాఖపట్నం సమీపంలోని గీతం విశ్వవిద్యాలయంలో మొదటి సంవత్సరం బీటెక్ (సీఎస్ఈ) చదువుతున్నాడు. దుర్గాభాయ్ దేశ్‌ముఖ్ హాస్టల్‌లో ఉంటున్న అతడు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం ఉదయం ఎంతసేపటికీ తన గది తలుపులు తెరవకపోవడంతో సహచరులు సిబ్బందికి తెలియజేశారు. వారు వచ్చేసరికి అపస్మారక స్థితిలో పడి ఉండడంతో హుటాహుటిన గీతం ఆస్పత్రికి తరలించారు. కాగా అప్పటికే అతడు మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. ఇస్మాయల్ తల్లిదండ్రులు హాజరత్, భూమిరెడ్డి వెంకటేష్ ఇచ్చిన సమాచారంతో పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగం రాలేదనే మనస్థాపంతో ఆత్మహత్య

సికెదిన్నె, ఫిబ్రవరి 14: ఉద్యోగం రాలేదని మనస్థాపానికి గురై దేవేందర్‌రెడ్డి (22) అనే యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ శంకర్‌నాయక్ తెలిపారు. వేముల మండలం కొత్తపల్లె గ్రామానికి చెందిన దేవేందర్‌రెడ్డి బంధువులు ఇంటికని చింతకొమ్మదిన్నె మండలం మూలవంక గ్రామానికి వచ్చాడు. చదువుకున్నా ఎటువంటి ఉద్యోగం రాకపోవడంతో మనస్థాపానికి గురై సోమవారం విషద్రావణం తాగాడు. వెంటనే వారి బంధువు విజయకుమార్ రిమ్స్‌లో చేర్పించి చికిత్స అందిస్తుండగా చికిత్స పొందుతూ బుధవారం మరణించాడన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మృతదేహం గుర్తింపు

సికెదిన్నె, ఫిబ్రవరి 14: చింతకొమ్మదిన్నె మండలం లింగారెడ్డిపల్లె సమీపంలో చెరువు సమీపంలో పది రోజుల క్రితం మరణించిన శవాన్ని గుర్తించినట్లు సీఐ శంకర్‌నాయక్ తెలిపారు. శవం ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని అతడి సెల్‌ఫోన్ ఆధారంగా అతను సిద్దవటం మండలం జంగాలపల్లె యానాదికాలనీకి రాజా (35)గా గుర్తించారు. సెల్‌ఫోన్ ఆధారంగా అతడి బంధువులకు ఫోన్ చేయగా వారు వచ్చి గుర్తుపట్టారని తెలిపారు. పది రోజుల కిందట ఇంటి నుంచి వచ్చాడని, ఇంతవరకు తిరిగి రాలేదని భార్య తెలిపిందన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

హత్య కేసులో ఐదుగురికి రిమాండు



నిందితుల వివరాలు తెలియచేస్తున్న ఎస్ఐ విద్యాసాగర్

బ్రహ్మంగారిమఠం, ఫిబ్రవరి 14 : బ్రహ్మంగారిమఠం మండలంలోని దిగువనేలటూరు పంచాయతీ మలుగుడుపాడు గ్రామానికి చెందిన కుంచాల రామ్మోహన్‌రెడ్డిని హత్య చేసిన సంఘటనలో ఐదుగురిని అరెస్టు చేసినట్లు బి.మఠం ఎస్ఐ విద్యాసాగర్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కుంచాల రామ్మోహన్‌రెడ్డి హత్య సంఘటనపై ఎ1 నిందితుడు అయిన కుంచాల వెంకటరెడ్డి బొగ్గుల బట్టీ వద్ద ఉన్న కుంచాల గురివిరెడ్డి, షేక్‌ఖాదర్‌వలి, మేరుగ తరుణ్, తమ్మిశెట్టి సుబ్బరాయుడు అనే ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వీరిని మైదుకూరు రూరల్ సీఐ శ్రీనాథరెడ్డి ఆధ్వర్యంలో బద్వేలు కోర్టుకు రిమాండుకు తరలించినట్లు బి.మఠం ఎస్ఐ విద్యాసాగర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బి.మఠం పోలీసు సిబ్బంది ఉన్నారు.

ప్రశాంత మనసుతో వాహనాలు నడపాలి

రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో లోక్ అదాలత్ జడ్జి స్వర్ణప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి స్వర్ణప్రసాద్, ప్రమాదరహిత డ్రైవర్‌ను సత్కరిస్తున్న అధికారులు

కడప (మారుతీనగర్) ఫిబ్రవరి 14: వాహనాలు నడిపే సమయంలో మనసును ప్రశాంతంగా ఉంచుకోవాలని లోక్ అదాలత్ జడ్జి స్వర్ణప్రసాద్ డ్రైవర్లకు సూచించారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం ఆర్టీసీ కడప రీజనల్ మేనేజర్ కార్యాలయ సముదాయ సమావేశ మందిరంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఆర్ఎం గోపాల్‌రెడ్డి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా జడ్జి స్వర్ణప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కోసారి ఎదుటి వాహనదారుడి అజాగ్రత్తతో కూడా ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయన్నారు. ప్రజలు ఎంతో నమ్మకంతో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేస్తుంటారని, వారిని సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాల్సిన బాధ్యత ప్రతి డ్రైవర్‌పై ఉందన్నారు. ప్రయాణికులతో సఖ్యతగా మెలగి వారి విశ్వాసాన్ని చూరగొనేలా ప్రతీ డ్రైవర్, కండక్టర్, విధులు నిర్వహించి సంస్థ పురోగతికి దోహదపడాలన్నారు. డ్రైవర్ బాధ్యతగా విధులు నిర్వహించగలిగితేనే వారి కుటుంబంతో పాటు సంస్థ కూడా అభివృద్ధి చెందుతుందన్నారు. చెడు వ్యసనాలకు బానిసైతే సంస్థతో పాటు, కుటుంబం కూడా నష్టపోవాల్సి ఉంటుందన్నారు. కొంతమంది హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనాలపై అత్యధిక వేగంతో ఎదురుగా వస్తుంటారని, అలాంటి సమయంలో కాసింత ఓర్పు, సంయమనంతో బస్సు స్పీడ్‌ను తగ్గించి, జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలని సూచించారు. అనంతరం ప్రమాదరహిత డ్రైవర్లను సత్కరించి నగదు పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు, అడిషనల్ ఎస్పీ సుధాకర్, ఆర్టీసీ అధికారులు కె.హరి, గోవర్ధన్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి, ఆర్టీసీ అసోసియేషన్ నాయకులు ఫక్రుద్దీన్, ఎ.ఆర్.మూర్తితో పాటు పలువురు డ్రైవర్లు పాల్గొన్నారు.

30 మద్యం సీసాల స్వాధీనం



వల్లూరు, ఫిబ్రవరి 14 : అక్రమంగా మద్యం అమ్ముతున్నారని విషయం తెలియడంతో దాడి చేసి 30 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ కత్తి వెంకటరమణ తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

రేపు సబ్ జూనియర్స్ జిల్లా స్థాయి బాల, బాలికల కబడ్డీ క్రీడా ఎంపికలు

కడప (స్పోర్ట్స్) ఫిబ్రవరి 14: ఉమ్మడి కడప జిల్లా సబ్ జూనియర్స్ బాల, బాలికల కబడ్డీ క్రీడా ఎంపికల ప్రక్రియ ఈనెల 16వ తేదీ శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక డీఎస్ఏ మైదానంలో నిర్వహించనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకటసుబ్బయ్య, వర్కింగ్ సెక్రటరీ టి.శ్రీవాణి, జాయింట్ సెక్రటరీ ఆర్.సునీల్ తెలిపారు. కాగా 53 కేజీ విభాగంలో ఔత్సాహిక క్రీడాకారులు ఆధార్ కార్డు (ఒరిజినల్)తో హాజరు కావాలన్నారు. అభ్యర్థులు మార్చి 19వ తేదీ 2008 లోపు జన్మించి ఉండాలన్నారు. ఇతర వివరాలకు 6304309294 అనే నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

జనసేన రాయలసీమ ఎన్నికల కోకన్వీనరుగా శివప్రసాద్



కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 14 : జనసేన పార్టీ రాయలసీమ ఎన్నికల కో-కన్వీనరుగా చంగారి శివప్రసాద్‌ను నియమిస్తూ ఆ పార్టీ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో జనసేన, టీడీపీ గెలుపు కోసం కృషి చేస్తానని తెలిపారు. అవకాశమిచ్చిన తమ అధినేత పవన్‌కళ్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

సొంతూరిలోనూ.. సీఎంపై నమ్మకం లేదా..?

- పులివెందులలోనూ అడుగడుగునా 'మా నమ్మకం నువ్వే జగన్' బోర్డులు
- ప్రజాధనం వృథా అంటున్న ప్రజలు



పులివెందులలోని సత్రం పాఠశాలకు సంబంధించిన బ్రిడ్జికి ఏర్పాటు చేసిన మా నమ్మకం నువ్వే జగన్ బోర్డులు

పులివెందుల రూరల్, ఫిబ్రవరి 14: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తర నియోజకవర్గ కేంద్రమైన పులివెందులలోనూ సొంత డబ్బా మానలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఫొటోతో పాటు మా నమ్మకం నువ్వే జగన్ అంటూ ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా దుకాణాల వద్ద బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. ఈ సొంతడబ్బా కొట్టుకునే వ్యవహారం పులివెందులకూ పాకింది. ఇక్కడున్న ప్రతి దుకాణం వద్దా బోర్డులు ఏర్పాటు చేశారు. దీనితో ప్రజాధనం వృథా అవుతోందని ప్రజలు స్థానిక ప్రజాప్రతినిధులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివరాలు ఇలా..

పులివెందుల పట్టణంలో బోలేవార్డు అంటూ పాతబస్టాండ్ నుంచి సత్రం పాఠశాల వరకు సుందరీకరణ పనులు చేపట్టారు. ఈ పనులలో భాగంగా దుకాణాలకు రంగులు వేయడంతో పాటు దుకాణాల పేర్లతో బోర్డులు కూడా తామే ఏర్పాటు చేస్తామంటూ మున్సిపల్ అధికారులు తెలియజేశారు. దీనికి దుకాణదారులు సరే అన్నారు. తీరా బోర్డులు వచ్చాక వీటిని చూసిన దుకాణదారులు అవాక్కయ్యారు. ముఖ్యమంత్రి జగన్ ఫొటో ఏర్పాటుచేసి అందులో మా నమ్మకం నువ్వే జగన్ అంటూ పెద్ద పెద్ద అక్షరాలు రాసి కింద చిన్న అక్షరాలతో దుకాణం పేరు ఏర్పాటుచేశారు. కొందరు మొహమాటంగా వీటిని దుకాణానికి పెట్టుకున్నా కొందరు పాత బోర్డుపైన దీనిని ఏర్పాటుచేసుకున్నారు.

ఇదిలా ఉండగా బోలేవార్డులో మాత్రమే ఏర్పాటు చేయాల్సిన 'మానమ్మకం నువ్వే జగన్' బోర్డులు పట్టణం మొత్తం ఏర్పాటుచేయడంపై ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. సొంత ఊరిలో కూడా ఇంత ప్రచారం అవసరమా అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఇది కేవలం స్థానిక ప్రజాప్రతినిధుల అతిభక్తి మాత్రమే అంటూ విమర్శిస్తున్నారు. ఇంతగా బోర్డులు ఏర్పాటు చేశారంటే.. సొంతూరి ప్రజలు కూడా తనను నమ్మడం లేదని సీఎం నమ్ముతున్నారేమో అని పలువురు పేర్కొంటున్నారు. అభివృద్ధి చేశామని నమ్మకం ఉంటే సొంతూరిలో కూడా ఇంతలా బోర్డులు బలవంతంగా ఏర్పాటు చేయడం ఎందుకని ప్రశ్నిస్తున్నారు.



పులివెందుల పట్టణం ముద్దనూరు రోడ్డులోని గాంధీ సర్కిల్ వద్ద ఉన్న దుకాణాలకు ఏర్పాటు చేసిన బోర్డులు



బోలే వార్డులో ఏర్పాటు చేసిన బోర్డులు

సమ్మె జయప్రదం చేయాలంటూ స్కూటరు ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న వివిధ సంఘాల నాయకులు

కడప (సెవెన్‌రోడ్స్), ఫిబ్రవరి 14 : కేంద్ర కార్మిక, రైతు, వ్యవసాయ సంఘాల ఆధ్వర్యంలో ఫిబ్రవరి 16న నిర్వహించ తలపెట్టిన గ్రామీణ భారత్ సమ్మె జయప్రదం చేయాలని కోరుతూ కడప నగరంలో బుధవారం స్కూటరు ర్యాలీ నిర్వహించారు. జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ సంధ్య సర్కిల్, కోటిరెడ్డి, జియాన్ కాలేజీ మీదుగా ఎన్టీఆర్ సర్కిల్, ఏడురోడ్లు, పొట్టిశ్రీరాములు, రాయల్ థియేటరు మీదుగా పాతబస్టాండు వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరిరెడ్డి మాట్లాడారు. రైతులు పంటలకు గిట్టుబాటు ధర చట్టాన్ని చేయాలని, ఏ రంగంలో పనిచేసే కార్మికులకైనా కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, కౌలు రైతులకు పంట రుణాలు, పంట నష్టం, ఇన్సూరెన్స్ సౌకర్యం భూయజమానితో సంబంధం లేకుండా కల్పించాలని, ఉపాధి పథకాన్ని 200 రోజులకు పెంచి, రోజువారీ వేతనం రూ.600 చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 16న గ్రామీణ బంద్, ట్రాన్స్‌పోర్టు సమ్మె, పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా, నగర ప్రధాన కార్యదర్శి ఉద్ది మద్దిలేటి, సీపీఐ నగర కార్యదర్శి వెంకటశివ, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్, వ్యవసాయకార్మిక సంఘం, మున్సిపల్, డీహెచ్‌పీఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బోధనలో సాంకేతికత ఉపయోగించండి



మాట్లాడుతున్న ఉప విద్యాధికారి రాజగోపాల్‌రెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 14 : బోధనలో సాంకేతికతను ఉపయోగించాలని ఉపవిద్యాధికారి రాజగోపాల్‌రెడ్డి సూచించారు. బుధవారం కలెక్టరేట్ సభా భవనంలో విజన్ 2025 ఇంక్లూజివ్ ఆంధ్ర డిజిటల్ పై ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిజిటల్ విద్యను బోధనలో ఉపయోగించడం ద్వారా సాధారణ విద్యార్థులతో పాటు దివ్యాంగులకు ఎనలేని ప్రయోజనం చేకూరుతుందన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చేసుకుని విద్యార్థులకు అందించాలన్నారు. సహిత విద్య ఉపాధ్యాయులు ట్యాబ్‌లు ఉపయోగించుకుని విద్యార్థుల కు మెరుగైన శిక్షణ ఇవ్వాలని సూచించారు. రాష్ట్ర సహాయ సహిత విద్య సమన్వయకర్త మల్లికార్జున, రీసోర్స్‌పర్సన్ సునీల్‌కుమార్, మహాలక్ష్మీనాయుడు దివ్యాంగులకు ఉద్దేశించిన వివిధ యాప్‌లను ఉపాధ్యాయులకు పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో సహిత విద్య జిల్లా సమన్వయకర్త మిట్టకేశవరెడ్డి, అకడమిక్ మానిటరింగ్ అధికారి ధనలక్ష్మి, రమణ మూర్తి, భవిత రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

రాచమల్లుకు వ్యతిరేకంగా.. అసమ్మతి నేతల ప్రచారం



13వ వార్డులో ఎమ్మెల్యే రాచమల్లు వద్దంటూ ప్రచారం చేస్తున్న వైసీపీ అసమ్మతి నేతలు

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 14: ప్రొద్దుటూరులో ఎమ్మెల్యే రాచమల్లు ప్రజావ్యతిరేకిగా మారాడని, రాష్ట్రంలో ఎక్కడాలేని అవినీతి పరుడుగా పేరుగాంచాడని ఆయనను ప్రజలు తిరిగి ఎన్నుకోవద్దంటూ వైసీపీ అసమ్మతినేతలు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి నేతృత్వంలో ప్రచారం చేపట్టారు. బుధవారం స్థానిక కొర్రపాడు రోడ్డులోని శివ చంద్రారెడ్డి ఆయిల్ మిల్లునుంచి మైదుకూరు రోడ్డు వరకు భారీ బైక్‌ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీలో వందలాదిమంది వైసీపీ కార్యకర్తలు రాచమల్లు వద్దు-జగన్ ముద్దు అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ రాచమల్లు ప్రసాద్‌రెడ్డికి అధిష్ఠానం టికెట్టు అధికారికంగా ప్రకటించకపోయినా ఆయన ప్రచారం చేసుకుంటున్నాడన్నారు. ప్రొద్దుటూరులో రాచమల్లుకు తప్ప మర్వెరికైనా టిక్కెట్టు ఇవ్వాలంటూ తాము ప్రజల్లోకి వెళ్లి ప్రచారం చేస్తున్నామన్నారు. అనంతరం వీరంతా శ్రీరాముల పేటలోని ఎమ్మెల్సీ రమేశ్ యాదవ్ ఇంటి వద్దకు వెళ్లారు. అక్కడి నుంచి 13 వవార్డులో రాచమల్లు ప్రసాద్‌రెడ్డికి వ్యతిరేకంగా ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. వైసీపీ అసమ్మతి నేతల ప్రచారంలో శివచంద్రారెడ్డితో పాటు వైసీపీ కౌన్సిలర్లు వంగనూరు మురళీధర్‌రెడ్డి, ఇర్ఫాన్ బాషా, మునీర్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు వెల్లాల భాస్కర్, పొట్టు లక్ష్మీరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా.. గురువారం నుంచి ఎమ్మెల్యే రాచమల్లు ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుడుతున్న నేపథ్యంలో వైసీపీ అసమ్మతి నేతలు ఆయనకు వ్యతిరేకంగా ప్రచారం చేపడుతుంటడంతో వైసీపీ వర్గాల్లో కలవరం మొదలైంది. ఇది ఉదిక్తలకు ఎక్కడ దారితీస్తుందో అని కొందరు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కన్నుల పండువగా మల్లేశ్వరస్వామి కల్యాణం



దుర్గాదేవి సమేత మల్లేశ్వరస్వామికి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు, కల్యాణానికి హాజరైన భక్తులు

బద్వేలు టౌన్, ఫిబ్రవరి 14 : పట్టణంలోని పోలీసుస్టేషన్ సబ్‌జైలు ఆవరణంలో ఉన్న కనకదుర్గ ఆలయంలో దుర్గాదేవి సమేత మల్లేశ్వరస్వామి కల్యాణం వేద పండితులు ప్రదీప్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో కన్నులపండువగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో దుర్గాదేవి సమేత మల్లేశ్వరస్వామి నూతన బ్రహ్మసూత్ర శివలింగం ప్రతిష్ఠను అంగరంగ వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి వేకువజాము నుంచే ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. కల్యాణాన్ని పచ్చని తోరణాలు, మంగళవాయిద్యాలు, వేదమంత్రాల సాక్షిగా కన్నులపండువగా నిర్వహించారు. అనంతరం స్వామివారిని గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం అన్నదానం చేసి ఆలయ కమిటీ వారు తీర్థ ప్రసాదాలు అందించారు.

కార్మికులు తమ పేర్లను నమోదు చేసుకోండి



కార్మికులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనరు క్రిష్ణ

బద్వేలు రూరల్, ఫిబ్రవరి 14 : కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఎకో సిస్టం పథకంను మున్సిపాలిటీలో ఉన్న మురుగు, సెప్టిక్ ట్యాంకు శుభ్రపరిచే కార్మికులు తమ పేర్లను వెంటనే నమోదు చేసుకోవాలని మున్సిపల్ కమిషనరు ఎం.క్రిష్ణ కోరారు. బుధవారం మున్సిపాలిటీలో కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికుల జీవన భద్రత, మెరుగైన ఉపాధి కల్పనే ధ్యేయంగా కేంద్రం ఈ పథకం ప్రవేశపెట్టిందన్నారు. మల, మురుగు శుభ్రం చేసే కార్మికులు, సెప్టిక్ ట్యాంకు డ్రైవర్లు, హెల్పర్లతో పాటు నేటి నుంచి నమస్తే కార్యక్రమంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా నిమగ్నమైనవారు కూడా ఈ పథకంలో నమోదు కావాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టరు లక్ష్మీనారాయణ, శానిటరీ సెక్రటరీలు పాల్గొన్నారు.

తవ్వా వెంకటయ్యకు సన్మానం



తవ్వా వెంకటయ్యను సన్మానిస్తున్న దృశ్యం

కడప (ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 14 : అధికార భాషా సంఘం సభ్యుడుగా బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా డాక్టర్ తవ్వా వెంకటయ్యకు బుధవారం స్థానిక లలితా కళానికేతన్ ఆధ్వర్యంలో సన్మానం చేశారు. లలిత కళానికేతన్, జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు వైవీయూ పాలకమండలి సభ్యుడు ప్రొఫెసర్ మూలమల్లికార్జున తల్లి ఓబులమ్మ జ్ఞాపకార్థం ఈ కార్యక్రమం నిర్వహించారు. మూల పెద్దమునిరెడ్డి, మూల ఈశ్వర్‌రెడ్డి మూల చిన్న అయ్యవారురెడ్డి, శివారెడ్డి, స్వామిరెడ్డి, బాలసుబ్బారెడ్డి , డాక్టర్ నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.


దామోదరం సంజీవయ్యకు నివాళులు అర్పిస్తున్న ఇన్‌చార్జి డీఆర్వో శ్రీనివాసులు


వేంపల్లెలో సంజీవయ్యకు నివాళులు అర్పిస్తున్న తులసిరెడ్డి


జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో నివాళులు అర్పిస్తున్న బండి జకరయ్య

ఆదర్శప్రాయుడు దామోదరం సంజీవయ్య

కడప(కలెక్టరేట్) ఫిబ్రవరి 14: దివంగత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య దేశం గర్వించ దగ్గ దళిత నేత అని ఇన్‌చార్జి డీఆర్వో శ్రీనివాసులు కొనియాడారు. సంజీవయ్య జయంతి సందర్భంగా బుధవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్లో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సంస్మరణ సభలో ఆయనతోపాటు సోషల్ వెల్ఫేర్ డీడీ సరస్వతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు కోసం జీవితాన్ని అంకితం చేసిన నిష్కళంక, నిస్వార్థ, నిరాడంబర నేత దామోదరం సంజీవయ్య అన్నారు. దళిత కుటుంబంలో జన్మించి ముఖ్యమంత్రి పదవిని అధిరోహించి యావత్ భారత దేశానికే ఆదర్శంగా నిలిచారని, ప్రతి ఒక్కరూ ఆయన అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీవో వెంకటరావు, డీఐఓ విజయకుమార్, డీసీహెచ్ఎస్ డాక్టర్ హిమదేవి, డిప్యూటీ కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి, కలెక్టరేట్ పరిపాలనాధికారి విజయకుమార్, పలు సెక్షన్ల సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో పీసీసీ ఉపాధ్యక్షుడు బండి జకరయ్య మాట్లాడుతూ ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు చెప్పలి పుల్లయ్య, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆనంద్‌కుమార్, సూర్యుడు, వేణుగోపాల్, సుధాకర్, సత్యం తదితరులున్నారు.

వేంపల్లె: ఆంధ్రరాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య ఆదర్శప్రాయుడని రాష్ట్ర కాంగ్రెస్ మీడియా చైర్మన్ నర్రెడ్డి తులసి రెడ్డి కొనియాడారు. సంజీవయ్య 103వ జయంతి సందర్భంగా బుధవారం వేంపల్లెలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంజీవయ్య గొప్పపరిపాలనదక్షుడని తెలిపారు, 38 ఏళ్ల అతి చిన్న వయసులో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రి అయ్యాడన్నారు. 51 ఏళ్ల వయసులో మరణించినా రాష్ట్ర, దేశ రాజకీయాల్లో తన చెరగని ముద్ర వేశారన్నారు. డాక్టర్ సుబ్రమణ్యం, రామకృష్ణ, అమర్,ఉత్తన్న, బద్రి,రాఘవ య్య, వెంకటేశ్, మహబూబ్ బాష, ఆరుశేర్ల సుబ్బరాయుడు, బాలం సుబ్బరాయుడు, రవి, వినయ్ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

వీఎన్‌పల్లెను కరువు మండలంగా ప్రకటించాలి

వీరపునాయునిపల్లె, ఫిబ్రవరి 14: వీరపునాయుని పల్లె మండలాన్ని కరువు మండలంగా ప్రకటిం చాలని పలువురు సభ్యులు కోరగా ఎంపీపీ రఘు నాథరెడ్డి ఏకగ్రీవంగా తీర్మానించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో ఎంపీపీ రఘునాథరెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించాలి. ఎంపీపీ మాట్లాడుతూ రానున్న వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. పలువురు సభ్యులు మాట్లాడుతూ వర్షాబావం కారణంగా రైతులు తీ వ్రంగా నష్టపోయారని, ఈ విషయం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి కరువు మండ లంగా ప్రకటించేలా చూడాలని కోరారు. పలువురు అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేద ని ఆరోపించారు. టీటీడీ నిధులతో నిర్మాణం లో ఉన్న కల్యాణ మండపం పనుల ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాల్లో స్థాని క ప్రజా ప్రతినిధుల పేర్లు వేయలేదని తెలి పా రు. మండలంలో అవసరమైన చోట విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని విద్యుత్ సబ్ ఇంజనీర్ తెలిపారు. జడ్పీటీసీ సభ్య రాలు అర్చన, ఎంపీడీఓ సురేంద్రనాథ్, ఏఓ శ్యామ్‌బాబు, అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతి నిధులు పాల్గొన్నారు.

● మండల సర్వసభ్య సమావేశం తీర్మానం


మాట్లాడుతున్న ఎంపీపీ రఘునాథరెడ్డి

విద్యార్థులు సమాజసేవలో భాగస్వాములు కావాలి

సికెదిన్నె, ఫిబ్రవరి 14: విద్యార్థులు సమాజసేవలో పాల్గొనాలని స్టేప్ ఆఫీసర్ సుబ్బరాయుడు తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం కొప్పర్తి గ్రామంలో కేఎస్ఆర్ఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంప్‌ను ఆయన పరిశీలించారు. బుధవారం విద్యార్థులు గ్రామంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి అమరజవాన్లకు నివాళులు అర్పించారు. 2019 ఫిబ్రవరి 14న పుల్వామా ప్రాంతంలో దేశంకోసం పోరాడే అనేక మంది సైనికులు అమరులు కావడం ఎంతో చింతించాల్సిన విషయమన్నారు. అనంతరం విద్యార్థులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వీఎస్ఎస్ మూర్తి, ఎండీ చంద్ర ఓబుళరెడ్డి (నాని), అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ప్రేమ్‌కుమార్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పులివెందుల రూరల్: మన కోసం దేశసరిహద్దులో రక్షణగా నిలబడ్డ సైనికుల త్యాగాలను గుర్తుంచుకోవాలని ఉపాధ్యాయులు విద్యార్థులకు సూచించారు. బుధవారం పట్టణంలోని జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో పుల్వామా ఉగ్రదాడిలో అశువులు బాసిన వీర సైనికులకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఫిబ్రవరి 14న పుల్వామా అనే ఊరిలో ఉగ్రవాదులు జరిపిన దాడిలో 40 మంది సైనికులు మరణించారని తెలిపారు. ఉపాధ్యాయులు సనావుల్లా, యూనస్, లతీఫ్, ఇక్బాల్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


అమరవీరులకు నివాళులు అర్పిస్తున్న కేఎస్ఆర్ఎం విద్యార్థులు


పులివెందుల: ఉర్దూ హైస్కూల్‌లో నివాళులర్పిస్తున్న విద్యార్థులు

బీసీలపై జగన్‌రెడ్డిది కపటప్రేమ

కడప (ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 14: జగన్‌రెడ్డి ఒంటెద్దు పోకడతో బీసీ నాయకులు వైసీపీ నుంచి బయటికి వస్తున్నారని, బీసీలకు ఆపార్టీలో గౌరవంలేదని వైసీపీ బీసీ సెల్ ప్రెసిడెంట్ కృష్ణమూర్తి చెప్పడంతో జగన్‌రెడ్డి అసలు స్వరూపం బయట పడిందని టీడీపీ బెస్త సాధికార కమిటీ రాష్ట్ర కన్వీనరు యాటగిరి రాంప్రసాద్ బుధ వారం ఓ ప్రకటన విడుదల చేశారు.. ఆయన కపట ప్రేమకు బీసీ లంతా మోసపోయారన్నారు. బీసీలకు తాత్కాలిక పదవులు ఇచ్చి పవర్ మాత్రం రెడ్ల చేతిలో పెట్టాడని ఆరోపించారు. రాష్ట్రంలో ని 56 కుల కార్పొరేషన్లు పేరుకు మాత్రమే ఉన్నాయి తప్ప నిధులు లేవన్నారు. వైసీపీలో బీసీలు తమ ఆత్మగౌరవం కోసం పోరాటం చేస్తున్నారని చెప్పారు.

వైఎస్సార్ ఆసరా చెక్కు అందజేత

సింహాద్రిపురం, ఫిబ్రవరి 14: వైఎస్సార్ ఆసరా నాల్గవ విడత సందర్భంగా బుదవారం సింహాద్రిపురం మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన సమావేశంలో పొదుపు సంఘాల మహిళలకు ఎంపీ అవినాష్‌రెడ్డి మెగా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా బలపనూరుకు చెందిన పొదుపు సంఘాల మహిళలు సీఎం రిలీఫ్ ఫండ్‌కు విరాళంగా ఐదు లక్షల రూపాయలు అందజేశారు. అనంతరం మహిళలకు చీరల పంపిణీ ప్రారంభించారు. రద్దీ పెరగడంతో డ్వాక్రా సంఘ ఆనిమేటర్ల ద్వారా అందజేస్తామని చీరల పంపిణీ కార్యక్రమం ఆపివేశారు. కార్యక్రమంలో ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు ఝాన్సీరాణి, ఎంపీపీ కాసుల అరుణ, మండల ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, సర్పంచ్ రామ్మోహన్, కార్యకర్తలు, డ్వాక్రా మహిళలు, అధికారులు పాల్గొన్నారు.

జేఈఈలో సోఫియా ఫాతిమాకు 97 శాతం



కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 14 : కడప నగరానికి చెందిన ఎక్సెల్ కంప్యూటర్స్ అధినేత పఠాన్ ఫైరోజ్‌ఖాన్ కుమార్తె సోఫి యా ఫాతిమాఖానం జేఈఈ మెయిన్స్‌లో 97శాతం సాధించింది. సాధారణ ఎంపీసీ విద్యార్థులు జేఈఈ పరీక్షల్లో తమ ప్రతిభ కనబరుస్తారు. అయితే సోఫియా ఇంటర్మీడియట్ బైపీసీ విద్యార్థిని. ఈమె తొలి ప్రయత్నంలోనే 97 శాతం సాధించడం విశేషం.

ఆవులను వీధుల్లో వదిలితే చర్యలు

వేంపల్లె, ఫిబ్రవరి 14: వాహనదారులకు, ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలిగిస్తున్న ఆవులు రోడ్లపై తిరగకుండా యజమానులు తీసుకెళ్లాలని వేంపల్లె పంచాయతీ కార్యదర్శి బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. మూడు రోజుల లోపు తీసుకెళ్లని పక్షంలో తరలిస్తామని తెలిపారు.

సీఏ విద్యార్థికి ఆర్థిక సాయం


విరాళాన్ని అందిస్తున్న ఆడిటర్ ఖాసింఖాన్

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 14 : నగరంలోని నబీకోటకు చెందిన సీఏ విద్యార్థి రాజేష్‌రెడ్డికి చదువు నిమిత్తం చాంద్‌బీ మెమోరియల్ ట్రస్టు రూ.10వేలు విరాళం అందించింది. మూడేళ్ల పాటు ఏడాదికి రూ.20వేలు చొప్పున సాయం చేసేందుకు అంగీకరించి రెండో విడతగా 10వేలను అందజేసినట్లు ఆడిటర్ షరీఫ్‌ఖాన్ తెలిపారు.

నల్లబ్యాడ్జిలతో రిమ్స్ ఉద్యోగుల నిరసన


రిమ్స్‌లో నిరసన తెలుపుతున్న వైద్య ఉద్యోగులు

కడప(కలెక్టరేట్)ఫిబ్రవరి 14: ఉద్యోగులు, ఉపాధ్యా యులు, పెన్షనర్లు, కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని ఏపీ ఎన్జీవో సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.రవి కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఏపీ జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రవికుమార్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున వైద్య ఉద్యోగులు, నర్సులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు

సమస్యలు పరిష్కరించాలి


వేంపల్లెలో డీటీకి వినతిపత్రం అందిస్తున్న ఎస్టీయూ నాయకులు

వేంపల్లె, ఫిబ్రవరి 14: రాష్ట్రంలో ఉద్యోగ ఉపాధ్యాయ కార్మికుల సమస్యలు పరిష్కరించాలంటూ ఎస్టీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఏపీజేఏసీ పిలుపు మేరకు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం వేంపల్లె డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సంగమేశ్వర్‌రెడ్డి, రీజియన్ కన్వీనర్ ప్రతాపరెడ్డి, మండల శాఖ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ, ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, ఆర్థిక కార్యదర్శి మహబూబ్ బాష, జిల్లా నాయకులు వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ను పరిశీలించిన డీఎస్పీ

సికెదిన్నె, ఫిబ్రవరి 14: మండలంలోని నాగిరెడ్డిపల్లె, సికెదిన్నె, జమాల్‌పల్లె పోలింగ్ కేంద్రాలను బుధవారం డీఎస్పీ ఎస్ఎండీ షరీఫ్ పరిశీలించి, ఎన్నికల సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను సీఐ శంకర్‌నాయక్‌కు వివరించారు. పోలీసులు పాల్గొన్నారు.

భారతదేశం ఆయుర్వేదానికి పుట్టినిల్లు

చాపాడు, ఫిబ్రవరి 14: భారతదేశం ఆయుర్వేదానికి పుట్టినిల్లు అని అచలానందస్వామి ఆశ్రమ పీఠాధిపతి విరజానందస్వామి అన్నారు. సీబీఐటీ కాలేజీలో బుధవారం వసంత పంచమిపై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను గౌరవించాలన్నారు. దేశంలోని ప్రజలు కుల, మత, భాష బేధాభిప్రాయం లేకుండా జీవించాలన్నారు. జీవితం చాలా విలువైందని, చిన్న విషయాలకు ఆత్మహత్యలు చేసుకోవద్దన్నారు. చైర్మన్ జయచంద్రారెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాసులరెడ్డి కూడా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజారోహణ

బి.కోడూరు, ఫిబ్రవరి 14 : మండల పరిధిలోని విజయనగర కాలనీలో బుధవారం ఆలయ ధర్మకర్త గోవిందాయపల్లె ఓబయ్య ధర్మపత్ని గురమ్మ ఆధ్వర్యంలో శ్రీలక్ష్మి నరసింహస్వామి విగ్రహ ప్రాణప్రతిష్ఠ , ధ్వజారోహణ నిర్వహించారు. పండితులు సాయి శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు.

ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలి


వేంపల్లె పంచాయతీ కార్యాలయంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ సాయిప్రత్యూష

వేంపల్లె, ఫిబ్రవరి 14: ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారం లభించేలా బాధ్యతగా పని చేయాలని ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ సాయిప్రత్యూష సచివాలయ ఉద్యోగులను ఆదేశించారు. వేంపల్లె ఎంపీడీఓ కార్యాలయం, మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయం, 1వ సచివాలయాన్ని బుధవారం ఆమె సందర్శించారు. ఎంపీడీఓ దివిజ, ఈఓపీఆర్డీ మల్లికార్జునరెడ్డి, ఈఓ సుబ్బారెడ్డితో మాట్లాడారు.

ట్రాఫిక్ నియమాలపై అవగాహన అవసరం


విద్యార్థులకు, డ్రైవర్లకు నిబంధనలు వివరిస్తున్న అధికారులు

పులివెందుల టౌన్, ఫిబ్రవరి 14: ట్రాఫిక్ నియమాలపై అవగాహన కలిగి ఉండాలని ఎంవీఐ బి.వి.ప్రసాద్ తెలియజేశారు. 35వ జాతీయ భద్రత మాసోత్సవాల సందర్భంగా బుధవారం స్థానిక శ్రీచైతన్య డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు రోడ్ సేఫ్టీ, దిశ యాప్‌పై అవగాహన కల్పించారు. ఆర్టీసీ, ఇతర వాహనాల డ్రైవర్లకు నిబంధనలు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం రామకృష్ణ, కళాశాల ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి,, ట్రాన్స్ పోర్ట్ కానిస్టేబుల్ కె.ఎస్.మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

సర్వరాయసాగర్ పనులు పూర్తిచేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న పాలెం సురేష్‌కుమార్‌రెడ్డి

కడప (మారుతీనగర్) ఫిబ్రవరి 14: సాగునీరు అందించే ముసుగులో వైసీపీ నేతల చేపలచెరువులు, ఆ ప్రాంతంలోని సిమెంట్ ఫ్యాక్టరీల కోసమే సర్వరాయ సాగర్ ప్రాజెక్ట్ నిర్మించినట్లుగా వుందని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పాలెం సురేష్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. 25వేల ఎకరాలకు సాగునీరు లక్ష్యంగా 2004లో ప్రారంభమైన పనులు నేటికీ పూర్తికాక పోవడంపై నిప్పులు చెరిగారు. బుధవారం స్థానిక ఎన్‌జీవో కాలనీలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లా డారు. పనులు పూర్తి చేయకుండానే నీరు నిల్వ చేయడంతో సమీపంలోని పండ్ల తోటల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రిజర్వాయర్ నీరు పొలాలకు చేరకపోగా వైసీపీ నాయకుల సిమెంట్ ఫ్యాక్టరీలకు, అలాగే చేపల చెరువుకు మాత్రమే నీరు అందుతున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇప్పటివరకూ మిగిలిపోయిన 52.51 కోట్ల పనులకు గాను 2022-23లో 212.89 కోట్ల అంచనాలతో 2022 సెప్టెంబర్ 14న పాలనాపరమైన అనుమతులు మంజూరు చేశారన్నారు. ఒప్పందం ప్రకారం 2022 నవంబర్‌లో పనులు మొదలు పెట్టాల్సి ఉన్నా ఇంతవరకూ ప్రారంభించక పోవడంలోని మతలబు ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా పనులు ప్రారంభించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రైతులతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. సమావేశంలో బీజేపీ నాయకులు దస్తగిరి, ప్రభుకుమార్, వి.ఎన్.పల్లె మండల అధ్యక్షులు గనేశ్వర్ యాదవ్ పాల్గొన్నారు.

ఒకటో తేదీనే పింఛన్లు ఇవ్వాలి


నిరసన వ్యక్తం చేస్తున్న పెన్షనర్లు

కడప(కలెక్టరేట్) ఫిబ్రవరి 14: ప్రతి నెల ఒకటో తేదీనే పెన్షన్లు ఇవ్వాలని జిల్లాలోని బుధవారం తమ సంఘ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాధాకృష్ణ, రామ్మూర్తి నాయుడు మాట్లాడుతూ ఏళ్ల తరబడి ప్రభుత్వ ఉద్యోగం చేసిన తమను ప్రభుత్వం చిన్న చూపు చూస్తోందన్నారు. ప్రతి నెల ఒకటో తేదీన పెన్షన్లు రాని కారణంగా ఎంతో మంది దీర్ఘకాల వ్యాధులున్న వారు మందులు, ఇతర అవసరాలకు అప్పులు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి నెలా ఒకటో తేదీన పెన్షన్లు ఇవ్వాలని, బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ కోశాధికారి నూనె నాగేష్, సభ్యులు శంకరయ్య, నారాయణ వర్మ, సుబ్బరాయుడు శ్రీనివాసులు, సిహెచ్ వెంకట సుబ్బారెడ్డి, నాగయ్య తదితరులు పాల్గొన్నారు

16న అనంతపురంలో కాంగ్రెస్ రాష్ట్ర స్థాయి సమావేశం


మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు జి.శ్రీరాములు


కడప(కలెక్టరేట్) ఫిబ్రవరి 14: అనంతపురంలో ఈనెల 16న నిర్వహించనున్న రాయలసీమ జిల్లాల సమావేశానికి జిల్లాలోని మండల, నియోజక వర్గ, జిల్లా, రాష్ట్ర కాంగ్రెస్ నేతలు పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గుండ్లకుంట శ్రీరాములు పిలుపు నిచ్చారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో నగ అధ్యక్షుడు విష్ణుప్రీతంరెడ్డితో కలసి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 16న రాయలసీమ స్థాయిలో జరిగే కాంగ్రెస్ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ ఇన్‌చార్జి మాణిక్యం ఠాగూర్ పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్ పొట్టిపాటి చంద్రశేఖర్ రెడ్డి, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధ్రువకుమార్ రెడ్డి పాల్గొన్నారు

తొలగించిన వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలి


వలంటీర్లను విదుల్లోకి తీసుకోవాలని కోరుతున్న మహిళలు

వేంపల్లె, ఫిబ్రవరి 14: వేంపల్లె మేజర్ పంచాయతీలోని 5వ సచివాలయం పరిధిలో ఉన్న వలంటీర్లను ధుల్లోకి తీసుకోవాలని ఆ ప్రాంత మహిళలు అధికారులను కోరారు. బుధవారం సచివాలయానికి వచ్చిన మహిళలు కార్యదర్శి రాఘవేంద్రను కలిసి మాట్లాడారు. వలంటీర్లను తిరిగి నియమిస్తే ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని తెలిపారు. ఈ విషయం ఎంపీడీఓకు విన్నవించాలని కార్యదర్శి సూచించడంతో, ఎంపీడీఓ దివిజ దృష్టికి తీసుకెళ్లగా కడప, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో ఉంటూ నెలల పాటు విధులకు హాజరుకాని వారిని, విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్నవారిని కలెక్టర్ ఆదేశాల మేరకు తొలగించామని తెలిపారు.

రాజరాజేశ్వరి ఆలయంలో సుమంగళిపూజ



కొలువుదీరిన రాజరాజేశ్వరీదేవి, సహస్రదీపాలంకరణ సేవలో పాల్గొన్న మహిళలు

కడప (కల్చరల్) ఫిబ్రవరి 14: నగరంలోని మునిసిపల్ మైదానంలో ఉన్న రాజరాజేశ్వరి ఆలయం 49వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం సాయంత్రం ఆలయ ప్రధాన అర్చకుడు పిడతల గోపాలకృష్ణ సారథ్యంలో సహస్ర దీపాలంకరణ, సుమంగళీపూజ, దశహారతుల కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో పాల్గొన్న మహిళలకు నిర్వాహకులు పసుపు, కుంకుమ, గాజులు, గంధం, పూలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈ.ఓ. ఎ. శ్రీధర్ పాల్గొన్నారు.

లక్ష్మీ తిరుమల్లేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం

వీరపునాయునిపల్లె, ఫిబ్రవరి 14: మండ లంలోని మొయిళ్లచెరువు గ్రామంలో కొం డపై వెలసిన లక్ష్మీతిరుమల్లేశ్వరస్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం సందర్భం గా బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా బండలాగుడు పోటీలను టీడీపీ నేత కాశీభట్ల సాయినాథ్‌శర్మ ప్రారంభించారు.

విజేతలకు బహుమతులు పంపిణీ


విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఆవోపా మహిళా ప్రతినిధులు

వేంపల్లె, ఫిబ్రవరి 14: వసంత పంచమి సందర్భంగా ఆవోపా ఆధ్వర్యంలో స్థానిక స్వామి వివేకానంద ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహు మతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆవోపా మహిళా విభాగం ప్రతి నిధులు, ఉపాధ్యా యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీలోకి కొనసాగుతున్న చేరికలు





చాపాడు, ప్రొద్దుటూరు, ఎర్రగుంట్లలో టీడీపీలోకి ఆహ్వానిస్తున్న ఆయా నియోజకవర్గాల ఇన్‌చార్జీలు పుట్టా సుధాకర్‌యాదవ్, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, భూపేశ్‌రెడ్డి

చాపాడు, ఫిబ్రవరి 14: మైదుకూరు నియోజకవర్గ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి అరాచకాలు పెరిగిపోయాయని టీడీపీ ఇన్‌చార్జి పుట్టాసుధాకర్ యాదవ్ అన్నారు. వెదురూరు గ్రామంలో బుధవారం సాయంత్రం సుమారు 200 వైసీపీ కుటుంబాలవారు సుధాకర్‌యాదవ్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. చేరిన వారిలో సానెపల్లె ఈశ్వర్‌రెడ్డి, సానెపల్లె సదాశివారెడ్డి, సానెపల్లె శివానందరెడ్డి, పాలగిరి ఓబుళరెడ్డి, రవీంద్రనాథరెడ్డి, తదితర కుటుంబాల వారు ఉన్నారు. వీరందరికి టీడీపీ కండువాలు కప్పి ఆయన పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సుధాకర్‌యాదవ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన బాగోలేదన్నారు. రాష్ట్రంలో మైదుకూరు నియోజకవర్గంలో వైసీపీ వారు ఇసుక దోపిడీకి ఎక్కువగా పాల్పడుతున్నారన్నారు. జనసేన పార్టీ మైదుకూరు నియోజకవర్గ ఇన్‌చార్జి మల్‌హోత్ర మాట్లాడుతూ జనసేన సైనికులు టీడీపీకి మద్దతు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు అన్నవరం సుధాకర్‌రెడ్డి, టీడీపీ నాయకులు పాలెంపల్లె సుబ్బరామిరెడ్డి, క్రిష్టారెడ్డి, అబ్బిరెడ్డి, ఓబులేసు, గోర్ల పెద్దసుబ్బరాయుడు, అక్బర్, పెద్దవీరారెడ్డి, అక్బర్ సలీం, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజుపాలెం..: వైసీపీలో నాయకులు, కార్యకర్తలకు సరైన విలువలు లేకపోవడంతో బుధవారం పర్లపాడు గ్రామానికి చెందిన ఇద్దరు వార్డుమెంబర్లు, 50 కుటుంబాలు గ్రామ నాయకుడు వెంకట సౌరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ ప్రొద్దుటూరు ఇన్‌ఛార్జ్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ వైసీపీ నుంచి 10వవార్డు మెంబరు పెద్దరాముడు, 3వ వార్డుమెంబరు రమాదేవి భర్త భాస్కర్ పార్టీలో చేరడంతో వారికి అన్నివిధాలా సహాయసహకారాలు అందిస్తామన్నారు.టీడీపీ మండల కన్వీనరు ధనిరెడ్డి విశ్వనాథరెడ్డి, టీడీపీ క్లస్టరు నాయకుడు వెంకటసుబ్బారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొండాపురం..: మండలంలోని పి.అనంతపురం గ్రామంలో గ్రామానికి చెందిన 10 కుటుంబాలు బుధవారం జమ్మలమడుగు టీడీపీ ఇన్‌ఛార్జ్ భూపేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరాయి.లింగేశ్వరరెడ్డి,సుర్యనారాయణరెడ్డి,విశ్వనాథరెడ్డి, జనార్ధన్‌రెడ్డి ,నవీన్‌కుమార్‌రెడ్డి, లింగారెడ్డి తదితర కుటుంబాలు టీడీపీలో చేరారు. భూపేశ్ పార్టీ కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జంబాపురం రమణారెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు గండ్లూరు నాగేశ్వరరెడ్డి , టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల..: ఎర్రగుంట్ల మండల పరిధిలోని పెద్దనపాడు గ్రామంలో బుధవారం 50కుటుంబాలు టీడీపీలో చేరాయి.టీడీపీలో చేరిన వారికి జమ్మలమడుగు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి టీడీపీ కండువా వేసి ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారిలో మాజీ సర్పంచ్ భూమిరెడ్డి శివారెడ్డి, బాలగంగిరెడ్డి, సుబ్బారెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, కృష్ణారెడ్డి, రామాంజనేయులు,ప్రసాద్, వెంకటనారాయణరెడ్డి, గంగిరెడ్డి, గంగాధర్‌రెడ్డి, గంగిరెడ్డి, మల్లికార్జున, సుబ్బారెడ్డి, శ్రీనివాసులరెడ్డి,వెంకటేష్, రమణ, భాస్కర్‌రెడ్డి, లక్ష్మయ్య, సంజీవ, సూరి, రామ్మోహన్‌రెడ్డి, శివరాం, శ్రీదేవి, లక్ష్మీదేవి,మాజీ సర్పంచ్ పార్వతమ్మ ఉన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జంబాపురం రమణారెడ్డి, ఎర్రగుంట్ల మండల టీడీపీ బాధ్యులు మోహన్‌రెడ్డి, పెద్దన్నపాడు గ్రామ నాయకులు శ్రీనివాసులరెడ్డి, రామకృష్ణారెడ్డి, బాలగంగిరెడ్డి, మధుసూదనరెడ్డి, నిత్యవర్ధన్‌రెడ్డి, మహేష్‌రెడ్డి, వెంకటమోహన్‌రెడ్డి, రామిరెడ్డి శంకర్‌రెడ్డి టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీ ఎంపీపీతో మంతనాలు



వైసీపీ ఎంపీపీ వర్గంతో మంతనాలు జరుపుతున్న రితీష్‌రెడ్డి

అట్లూరు, ఫిబ్రవరి 14 : అట్లూరు మండలంలోని వైసీపీకి చెందిన ఎంపీపీ రమాదేవి, మండల ఇన్‌చార్జ్ రెడ్డయ్య , ఎంపీపీ వర్గీయులను అట్లూరు క్రాస్ రోడ్డులోని రెడ్డయ్య నివాసంలో పార్టీలోకి ఆహ్వానించేందుకు బుధవారం బద్వేలు యువ నాయకుడు రితీష్‌కుమార్‌రెడ్డి మంతనాలు జరిపారు. వైసీపీ మండల ఇన్‌ఛార్జ్‌గా కొనసాగిన రెడ్డయ్య మాట్లాడుతూ ఎమ్మెల్సీ గోవిందరెడ్డి అసమ్మతి వర్గీయులంతా మండలంలోని ముత్తుకూరు, కామసముద్రం, అట్లూరు, కొండూరు, ఎస్.వెంకటాపురం, మన్యంవారిపల్లె, కమలకూరు గ్రామాల్లో సర్పంచ్‌లు ఎంపీటీసీలు కూడా రితీష్‌కుమార్‌రెడ్డి సమక్షంలో టీడీపీ కండువాలు వేసుకుని పార్టీలో చేరబోతారని ఆయన తెలిపారు. వైసీపీ నుంచి భారీగా టీడీపీలో చేరికలతో దాదాపు మండలంలోని 80 శాతం వైసీపీ బలహీన పడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, రైల్వే కాంట్రాక్టరు, టీడీపీ నాయకులు నందగోపాల్‌రెడ్డి, సూర్యనారాయణరెడ్డి, అమర్‌నాధరెడ్డి, ఆరవ శ్రీనివాసులరెడ్డి, టీడీపీ కార్యకర్తలు ఉన్నారు.

దువ్వూరులో టీడీపీ కార్యాలయం ప్రారంభించిన పుట్టా

మైదుకూరు రూరల్, ఫిబ్రవరి 14 : రానున్న ఎన్నికలలో టీడీపీని మరింత బలోపేతం చేసేందుకు దువ్వూరులో తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని బుధవారం ఆపార్టీ మైదుకూరు ఇన్‌చార్జ్ పుట్టా సుధాకర్‌యాదవ్ కార్యకర్తల సమక్షంలో ప్రారంభించారు. కార్యక్రమానికి మండల నాయకులు బొరెడ్డి రమణారెడ్డి, పెద్ద ఎత్తున నాయకులు,కార్యకర్తలు తరలివచ్చారు.

బాలికలకు పరీక్ష సామగ్రి పంపిణీ

కలసపాడు, ఫిబ్రవరి 14 : పెండ్లిమర్రి గ్రామ సమీపంలో ఉన్న కస్తూర్బాగాంధి బాలికల విద్యాలయంలోని ఇంటర్, పదో తరగతి బాలికలకు బుధవారం వివేకానంద ఫౌండేషన్ స్వచ్ఛంధ సేవా సంస్థ ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. అనంతరం విద్యాలయంలో చదువుతున్న 65 మంది విద్యార్థినులకు పరీక్షలకు అవసరమైన ఎగ్జామ్ ప్యాడ్స్, పెన్నులు, పెన్సిళ్లు, మెండర్లు, రబ్బర్లు, పౌచ్‌లు, హాల్‌టికెట్ కవర్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకుడు పాపిజెన్ని రామక్రిష్ణారెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ రెడ్డి జ్యోతి, ఉపాధ్యాయినులు సంస్థ ప్రతినిధులు బొజ్జ ప్రసాద్, స్వర్ణ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

భారతదేశం ఆయుర్వేదానికి పుట్టినిల్లు

చాపాడు, ఫిబ్రవరి 14: భారతదేశం ఆయుర్వేదానికి పుట్టినిల్లు అని అచలానందస్వామి ఆశ్రమ పీఠాధిపతి విరజానందస్వామి అన్నారు. సీబీఐటీ కాలేజీలో బుధవారం వసంత పంచమిపై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను గౌరవించాలన్నారు. దేశంలోని ప్రజలు కుల, మత, భాష బేధాభిప్రాయం లేకుండా జీవించాలన్నారు. జీవితం చాలా విలువైందని, చిన్న విషయాలకు ఆత్మహత్యలు చేసుకోవద్దన్నారు. చైర్మన్ జయచంద్రారెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాసులరెడ్డి కూడా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించడంలో నిర్లక్ష్యం తగదు

బద్వేలు, ఫిబ్రవరి 14: ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిల పట్ల రాష్ట్రప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం తగదని ఏపీ జేఏసీ బద్వేలు తాలూకా కన్వీనర్ నరసింహారెడ్డి, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాధన విజయ్‌కుమార్, ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామచంద్రారెడ్డి హెచ్చరించారు. బుధవారం 12వ పీఆర్‌సీని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మధ్యాహ్నం భోజన విరామ సమయంలో తాలూకా జేఏసీ ఆధ్వర్యంలో నల్లరిబ్బన్లు ధరించి తహశీల్దారు కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. అనంతరం తహసీల్దారు చంద్రశేఖరరావు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎన్‌జీవో తాలూకా అధ్యక్షుడు అమర్‌నాథరెడ్డి, ఉపాధ్యక్షుడు మల్లికార్జునరావు,శివరామిరెడ్డి, డాక్టర్ మీనాక్షిరెడ్డి, సెక్రటరీ బ్రహ్మయ్య, గంగన్న, దేవానందం, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కరించండి

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 14 : రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక , పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం బుధవారం రెవెన్యూ ఇన్‌స్పెక్టరు సుధాకర్‌రెడ్డికి వినతిపత్రం అందించి నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. జేఏసీ నాయకులు కుళ్లాయప్ప, పుల్లయ్య, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

బద్వేలు టౌన్, ఫిబ్రవరి 14 : పట్టణంలోని రాజుగారివీధిలో వెలసియున్న సీతారామాంజనేయస్వామి దేవస్థానంలో బుధవారం 11వ వార్షికోత్సవ సందర్భంగా సీతారాముల కళ్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. వేకువజాము నుంచే స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సీతారాముల విగ్రహాలకు కళ్యాణం నిర్వహించారు. ఆలయ కమిటి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

బీసీలకు మూడు అసెంబ్లీ నియోజకవర్గాలను కేటాయించాలి

బద్వేలు, ఫిబ్రవరి 14: రాజకీయపార్టీలన్నీ సామాజిక న్యాయం పాటిస్తూ జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాలలో మూడింటిని బీసీలకు కేటాయించాలని ఏపీ బీసీ చైతన్య సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు రమణ, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి గురుమూర్తి పేర్కొన్నారు. బుధవారం స్థానిక బీసీ చైతన్య సమితి కార్యాలయంలో బీసీ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రొద్దుటూరు, జమ్మలమడుగు అసెంబ్లీ నియోజకవర్గాలను బీసీ కులాలకు కేటాయించి జనాభాలో 55 శాతానికి పైగా ఉన్న బీసీలకు న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ కమిటీ బద్వేలు పట్టణ అధ్యక్షుడు సత్తార్, రజక సంఘం నాయకుడు వెంకటరమణ, డీవైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి నాగార్జున ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ రసూల్, ఖాజా గౌస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వస్థలంలో గుడిసెలు వేసేందుకు ప్రయత్నం

అడ్డుకున్న రెవెన్యూ అధికారులు

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 14 : ప్రభుత్వస్థలంలో కొందరు రెవెన్యూ అనుమతి లేకుండా గుడిసెలు వేసే ప్రయత్నం చేశారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు పోలీసుల సహకారంతో వారి ప్రయత్నాలను విఫలం చేశారు. బుధవారం సాయంత్రం పోరుమామిళ్ల మండలంలోని రంగసముద్రం పంచాయతీ పరిధిలోని 1262 సర్వేనెంబరులో కొందరు గుడిసెలు వేసేందుకు ప్రయత్నించగా విషయం తెలుసుకున్న ఆర్ఐ సుధాకర్‌రెడ్డి, తహసీల్దారు శిరీషా ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది ఎస్ఐ మల్లికార్జునరెడ్డి సహకారంతో ప్రయత్నాన్ని విఫలం చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో ఓబయ్య పాల్గొన్నారు.

ఏపీ జేఏసీ ఉద్యమ కార్యాచరణను విజయవంతం చేయండి

జమ్మలమడుగు, ఫిబ్రవరి 14: ఏపీ జేఏసీ ఉద్యమ కార్యాచరణను విజయవంతం చేయాలని జమ్మలమడుగు జేఏసీ చైర్మన్ పి.నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం జమ్మలమడుగులో ప్రభుత్వ ఆస్పత్రిలో అలాగే ప్రభుత్వ పెన్షనర్ల సంఘం సభ్యులతో, నాయకులతో వారు సమావేశం అయ్యారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఏపీ జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యమ శంఖారావం పూరించబోతున్నట్లు వారు తెలిపారు. కార్యాచరణలో భాగంగా ప్రభుత్వ కార్యాలయాల్లో, పాఠశాలలో ఉద్యోగ, ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరుకావాలని తహసీల్దారు కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దారు వేణుగోపాల్‌కు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు, సెక్రటరి రఘునాథరెడ్డి, మహిళా నాయకురాలు లీలారాణి, పెన్షనర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు పొన్నారి దస్తగిరి, అధ్యక్షుడు దేవదానం, రామచంద్రారెడ్డి, సుబ్బారెడ్డి, ప్రభుత్వ ఆస్పత్రి వద్ద నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజారోహణ

బి.కోడూరు, ఫిబ్రవరి 14 : మండల పరిధిలోని విజయనగర కాలనీలో బుధవారం ఆలయ ధర్మకర్త గోవిందాయపల్లె ఓబయ్య ధర్మపత్ని గురమ్మ ఆధ్వర్యంలో శ్రీలక్ష్మి నరసింహస్వామి విగ్రహ ప్రాణప్రతిష్ఠ , ధ్వజారోహణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చుట్టు పక్కల గ్రామ ప్రజలు విరివిగా పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు. కార్యక్రమాలన్నీ పండితులు సాయిశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు, అన్నదానం నిర్వహించారు.

రాజగోపాల్‌రెడ్డిని పరామర్శించిన రితీష్‌రెడ్డి

అట్లూరు, ఫిబ్రవరి 14 : అట్లూరు మండలం టీడీపీ సీనియర్ నాయకుడు టీడీపీ మాజీ మండలాధ్యక్షుడు బి. రాజగోపాల్‌రెడ్డి అనారోగ్యంతో ఉండడంతో బుధవారం ఆయన స్వగృహం అట్లూరుకు బద్వేలు యువ నాయకుడు రితీష్‌కుమార్‌రెడ్డి వెళ్లి పరామర్శించారు. అనంతరం మండలంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలు గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ రైల్వే కాంట్రాక్టరు బి.నందగోపాల్‌రెడ్డి, మంచూరి సూర్యనారాయణరెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, రెడ్డయ్య, అరవ శ్రీనివాసులురెడ్డి, రామచంద్రారెడ్డి, మండల మాజీ అధ్యక్షుడు అమర్‌నాధ్‌రెడ్డి, మద్దిక పుల్లారెడ్డి, అల్లం వెంకటసుబ్బయ్య, విష్ణువర్ధన్‌రెడ్డి, శివయ్యస్వామి, గంగిరెడ్డి, క్రిష్టారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, చిన్నపరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉద్యోగుల పట్ల చిన్నచూపు తగదు

కలసపాడు, ఫిబ్రవరి 14 : ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిరంకుశ వైఖరి అన్యాయమని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ పి.రమణారెడ్డి అన్నారు. ఏపీ జేఏసీ ఉద్యమ కార్యాచరణలో భాగంగా తహసీల్దారు కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దారు నరేంద్రకు వినతిపత్రం అందించిన అనంతరం రమణారెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ఎం.శేఖర్‌బాబు, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, మండలశాఖ అధ్యక్షుడు వెంకటరెడ్డి, జిల్లా కమిటీ కన్వీనరు సత్యనారాయణ, శివారెడ్డి, జిల్లా కౌన్సిలర్లు శ్రీనివాసులు, విజయభాస్కర్‌రెడ్డి, బాలరాజు, శ్రీనివాసులు, రామక్రిష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

50 కుటుంబాలు జనసేనలో చేరిక



మైలవరం, ఫిబ్రవరి 14: మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయ ఆవరణలో జమ్మలమడుగు జనసేన పార్టీ యువ నాయకులు నాగార్జున, జగదీష్ ఆధ్వర్యంలో మైలవరానికి చెందిన 50 కుటుంబాల వారిని జనసేన పార్టీలోకి కండువా కప్పి వారు ఆహ్వానించారు. మైలవరంలో బుధవారం నాగరాజు, ఆంజనేయులు, బాను నాయక్, శోభరామయ్య, మేఘనాయక్, శివనాయక్, వెంకటేష్‌నాయక్, ఆసన్న, స్వామి, శేఖర్, శ్రీనునాయక్, ప్రసాద్, రాముడు, వివేక్‌నాయక్, రఫీ, బాలు, కిరణ్ తదితరులు పార్టీలో చేరారు.

పోరాటం తప్పనిసరి

జమ్మలమడుగు, ఫిబ్రవరి 14: సమస్యలు పరిష్కరించుకునేందుకు పోరాటం తప్పదని సీపీఎం పట్టణ కార్యదర్శి యేసుదాసు సూచించారు. బుధవారం జమ్మలమడుగు పట్టణంలో ఆటోస్టాండులో సీపీఎంకు చెందిన స్టిక్కర్లను అతికించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ నాయకులు విజయ్, దివాకర్, వినయ్‌కుమార్, అబ్రహం, మున్నా, బాష తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 14 : మండలంలోని చెక్‌పోస్టుల వద్ద పోరుమామిళ్ల ఎస్ఐ మల్లికార్జునరెడ్డి వాహనాల తనిఖీ నిర్వహించారు. బుధవారం రాత్రి మల్లకతువ సమీపంలో చెక్‌పోస్టుల వద్ద వాహనాలను తనిఖీ చేశారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఈ వాహనాలను తనిఖీ చేస్తున్నట్లు సమాచారం.

రాష్ట్రంలో వైసీపీకి ఓటమి తప్పదు




ప్రొద్దుటూరులో ప్రచారం చేస్తున్న ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, వీరశివారెడ్డి, పోరుమామిళ్లలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న రోశన్న

ప్రొద్దుటూరు,ఫిబ్రవరి 14 : రాష్ట్రంలో వైసీపీకి ఓటమి తప్పదని టీడీపీ శ్రేణులన్నీ గెలుపుధీమాతో వున్నాయని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రవీణ్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక 26వవార్డు శాంతకుమారి వీధిలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డి,టీడీపీ మాజీ కౌన్సిలర్‌సీతారామరెడ్డి భరత్‌కుమార్‌రెడ్డి,జయసింహారెడ్డి, ప్రసాద్‌రెడ్డి, నియోజవర్గ పరిశీలకుడు ఏవీఆర్ ప్రసాద్, మండల కన్వీనర్ బాబుల్‌రెడ్డి, రాజుపాళెం కన్వీనర్‌విశ్వనాధరెడ్డి పాల్గొన్నారు.

కొండాపురం..: వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జ్ భూపేశ్‌రెడ్డి విమర్శించారు.మండలంలోని పి.అనంతపురం గ్రామంలో బుధవారం బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీని భారీ మెజారిటీ తో గెలిపించాలని ఆయన ఇంటింటికి వెళ్లి అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జంబాపురం రమణారెడ్డి,గండ్లూరు నాగేశ్వరరెడ్డి, మాజీ సర్పంచ్ బాబుల్‌రెడ్డి, ఎనమలచింతల రమేష్‌రెడ్డి,రామచంద్రారెడ్డి, రాజగోపాల్‌రెడ్డి,మాధవరెడ్డి,హరిమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

మైలవరం..: టీడీపీతోనే రాష్ట్ర ప్రజలకు మంచి భవిష్యత్తు ఉంటుందని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జ్ భూపేశ్‌రెడ్డి సతీమణి జ్యోతి అన్నారు. బుధవారం మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరుగుతూ టీడీపీ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొండయ్య, పాపిరెడ్డి, సూర్యపెద్దిరాజు, మాజీ ఎంపీటీసీ నరసింహ, సుదర్శన్‌రెడ్డి, పాములేటి, బాస్కర్‌రెడ్డి, పెద్దిరెడ్డి పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..: టీడీపీ మేనిఫెస్టోలోని పథకాలను ప్రజలకు వివరిస్తూ బద్వేలు టీడీపీ ఇన్‌చార్జ్ బొజ్జ,రోశన్న ప్రచారం నిర్వహించారు. బుధవారం పోరుమామిళ్లలోని రంగసముద్రం పంచాయతీ పరిధిలో గల మహబూబ్‌నగర్ కాలనీలో ఆయన బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీలో భాగంగా ఉపాధి కూలీలకు ఆ ప్రాంతంలో ఉన్న ప్రతి ఒక్కరికీ కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సీతా వెంకటసుబ్బయ్య, తిరుమలశెట్టి సుబ్బారావు, కల్వకూరి రమణ, కల్వకూరి రమేష్, బండి ఓబులేసు, డ్రైవర్ ఎస్ ఎంబాషా, అన్వర్ పాల్గొన్నారు.

కలసపాడు..: మండలంలోని ముదిరెడ్డిపల్లె, నల్లగొండుగారిపల్లె గ్రామాల్లో బుధవారం ఇన్‌చార్జ్ బొజ్జ రోశన్న బాబు ష్యూరిటీ భవిష్యత్తుగ్యారంటీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి టీడీపీ మేనిఫెస్టో గురించి ప్రజలకు వివరించారు. బద్వేలు మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ ఎస్ఏ రంతుల్లా, మండల అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, పట్టాభిరెడ్డి, భద్రయ్య, నాగశ్వర్‌రావు, రామసుబ్బారెడ్డి, వెంకటేశ్వర్లు, మల్లికార్జున, లాల్‌పీరా, మద్దులేటి, వెంకటయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అట్లూరు..: మండలంలోని వరికుంట గ్రామంలోని ఎస్సీ కాలనీ, యానాదికాలనీల్లో బుధవారం టీడీపీ నాయకులు ఇంటింటికీ తిరిగి టీడీపీ మేనిఫెస్టోను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు అందించారు. టీడీపీ ప్రభుత్వం వచ్చాక చేపట్టబోయే సంక్షేమ పథకాలను వివరించారు. పార్లమెంటు జిల్లా అధ్యక్షురాలు పాలకొండు సుధారాణి, పోరుమామిళ్ల మాజీ సర్పంచ్ హబీబున్నీసా, బద్వేలు మహిళ అధ్యక్షురాలు మాచుపల్లె లక్ష్మీదేవి, వసుంధర, సుబ్బరామిరెడ్డి, నారాయణరెడ్డి, సర్పంచ్ రమణయ్య, గొర్ల చిన్న క్రిష్ణయ్య, వెంకటసుబ్బమ్మ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మైలవరంలో ప్రచారం చేస్తున్న జ్యోతి



అట్లూరులో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు